# కొత్త రచయితలు

ప్రియురాలి పెదవి దేవేంద్ర పదవి అని ఆరుద్ర వూరకనే అన లేదు. అది ఊహిస్తేనే ఊపి రందటం లేదు. అందుకేనేమో ఆ కొటేషన్ నా మనసును పిండేసింది. అలాంటి పదవి కోసం పెదవి కోసం జీవితాన్ని అర్పించాలనుకున్నాను.

ఆశయం బాగానే వుంది గాని అమ్మాయి సంగతి గుర్తుకొచ్చేసరికి కొంచెం నీరసం వచ్చింది. అందమైన అమ్మాయిని ప్రియురాలిగా ఎలా పొందాలో అర్థం కాలేదు. ప్రేమ వేట ఈ క్షణం నుంచే ప్రారంభించి ఆశయాన్ని నెరవేర్చుకోవాలను కున్నాను.

కాలేజి ఎదుట ప్రేమకు మొదటి షెడ్యూలు ప్రారంభించాను. ఆ వాతావరణం చూసేసరికి మనసు అదోలా అయిపోయింది. డిగ్రీ అయినా మరలా ఇక్కడ తగలడ్డావేంట్రా అని కాలేజి నిలదీసినట్లు త్రుళ్లిపడ్డాను.

నా ఆలోచనలను తరిమివేస్తూ కాలేజి బెల్ మ్రోగింది. క్షణాలలో అటెన్షన్‌లోకి వచ్చి నా దృష్టిని కాలేజి కాంపౌండ్ వైపు సారించాను.

చెదిరిపోయిన సీతాకోక చిలుకల్లా అందమైన అమ్మాయిలు గుంపులు గుంపులుగా బయటకు వచ్చారు. అందులో ఒక సీతాకోకచిలుక రూపం నా ప్రేమ జ్వాలపై ఆజ్యం పోసింది. ఆమె సహజంగా చూసిన చూపుకు నా హృదయం బీటలు తీసింది.

నాలో ఎన్నో ఏళ్ళుగా నిక్షిప్తమైన ఏవో తెలియని ఆర్ద్రతా భావాలు ఆ చూపుతో పురివిప్పాయి. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటే ఇదేనేమో! ఈ క్షణం నుంచే ప్రేమలో ముందుకెళ్లా లని ఆమె వెనుకబడ్డాను.

నా ప్లానులో భాగంగా ఆమె రోజూ వెళ్ళే రూటు కనిపెట్టాను. ఎదుట పడటం పాపం-వెంటనే రొమాంటిక్ చూపు ఇచ్చేవాడిని. ఆమె చుట్టూ అనేకసార్లు తిరగటం మూలాన నన్ను చూసిన వెంటనే ఆమె కదలికలో మార్పు నాకు స్పష్టంగా కనిపించింది. దానిని మొదటి విజయంగా స్వీకరించాను.

ఇక రెండో షెడ్యూలు ప్రారంభిస్తూ, ఒక రోజు "హలో మిస్" అన్నాను. ఆమె తడబడకుండా "ఛీ" అంది. ఆ ప్రతి చర్యకు అదిరిపడ్డాను. అయినా నాకు బాధనిపించలేదు.

అవమానాల క్షవరం అవుతూనే గాని ప్రేమకు వివరం రాదు. ప్రేమలో ఇవి మామూలే. కోపంగా "ఛీ" అన్న ఆ నోటితోనే నా కౌగిట్లో సిగ్గుతో గారంగా "ఛి-ఛి" అనేలా చేసుకోవాలనుకున్నాను.

"నీవు లేనిదే నాకీ ప్రపంచం చీకటిగా కనిపిస్తుందనీ ఇంకొక ప్రయత్నం చేసి చూశాను. వెంటనే కళ్ళ డాక్టరుకి చూపించుకోమంది. ఆ సమాధానానికి నాకు నవ్వాలో ఏడ్వాలో తెలియలేదు.

కాలేజి చుట్టూ, టైపు ఇన్‌స్టిట్యూట్ చుట్టూ గానుగెద్దులా తిరిగాను. ఫలితం కనిపించలేదు. ఆ బింకం నా పట్టుదలను, ఆమెపై నాకున్న ప్రేమను రెట్టింపు చేశాయి.

కాలేజిలో క్లర్కుని పట్టుకుని అడ్మిషన్ రిజిష్టరులో ఆమె పేరు చూడమన్నాను. కొలంబస్ అమెరికాను కనుగొన్నట్టు క్లర్కు సహాయంతో ఆమె పేరు కనిపెట్టేశాను.

అప్పటి నుంచి ఆ పేరు ఉచ్చరిస్తే చాలు నాలో అనిర్వచనీయమైన అనుభూతి మనసుని మంచుకొండల్లోకి తోసేసింది.

ప్రత్యూష... ఎంత చక్కని పేరు! వసంత కాలంలో ఆకును జారిన మంచు బిందువుని చూసిన భావన తొణికిసలాడుతుంది.

కళ్యాణ మండపం ముందు ప్రత్యూష వెడ్స్ కిషోర్ అన్న బోర్డులు కలల్లోకి వచ్చేయడం మొదలెట్టాయి. క్రమంగా నాలో మొండి ధైర్యం ఆవహించింది. రేపే దీనికి ఆఖరి పరిష్కారం అనుకున్నాను.

ప్రొద్దుటే పరగడుపున కాలేజి దగ్గర మూడో షెడ్యూలు ప్రారంభించాను. అప్పటికి మార్నింగ్ షిఫ్టు క్లాసులు మొదలైపోయాయి. ప్రత్యూష క్లాసుకెళ్ళిపోయి వుంటుంది. ఏం చెయ్యాలో తోచలేదు. కాలేజి అవ్వాలంటే ఇంకా నాలుగు గంటలాగాలి. అసహనంగా కూలబడిపోయాను.

రిస్టువాచ్‌లోని నిముషాల ముళ్ళు గంటల ముళ్ళుగా అనిపించి ఎదురు చూడటమే ఎడబాటుగా మారింది. ఒక ప్రక్క నీరసం, మరో ప్రక్క ఆకలి దహించివేశాయి. ఇవన్నీ ప్రేమకు పరీక్షలని సరిపెట్టుకున్నాను.

ప్యూనుగాడి పుణ్యమా అని బెల్ మ్రోగింది. నూతనోత్సాహంతో ఆమె రోజూ వెళ్ళే సందు దగ్గర కాసాను. అక్కడ పెద్దగా జన ముండరు. ఆమె నన్ను కనిపెట్టినట్టుంది. నడక స్పీడు పెంచేసింది. "ప్రత్యూషగారూ! మాట" అన్నాను. ఏమీ మాట్లాడలేదు. మరల అదే మాట ప్రయోగించాను.

వెంటనే నా వైపు త్రాచుపాములా చూసి "నీ వంటే నా కిష్టం లేదు. ఇలా ఆడవాళ్ళ వెంట తిరగడం తప్ప వేరే పని లేదా?" అని తిట్టిపారేసింది.

నా మెదడు మొద్దుబారిపోయింది. తెలియని ఆవేదన చుట్టుముట్టింది. నాకు తెలియకుండానే కళ్ళ నుండి నీళ్ళు జలజలా రాలాయి.

అది గమనించిన ప్రత్యూష గుండెల్లో ఎక్కడో చిన్న ప్రకంపన, ముఖంలో బెదురు తాలూకు అస్పష్టపు చారలు. ప్రత్యూష ఇంకా ఏదో అనబోయింది. వెంటనే ఆ మాటలను కట్ చేశాను.

"ప్రత్యూషగారూ! ఎంత శ్రమ పడైనా సరే మిమ్మల్ని పొందాలను కున్నాను. మీ ఈ ప్రవర్తనతో నా ఆశ క్షణాల్లో రాలిపోయింది" నిండా మునిగాక చలేమిటని ప్రేమా సర్ప దష్టుడునై సూటిగా నా వేదనను వ్యక్తపరిచాను.

ఆమె కదలకుండా అలాగే వుండిపోయింది. అదే మంచి అవకాశమను కుంటూ మిగతా నా ఉపన్యాసం ధైర్యంగా మొదలుపెట్టేశాను.

"ప్రత్యూషగారూ! మిమ్మల్నెప్పుడూ ప్రేమదేవతగా చూశానే తప్ప వేరే విధంగా చూడలేదు. అయినా నన్ను దురదృష్టం వెంటాడింది. చివరిగా మిమ్మల్ని కోరుకునేదొకటి. మీతో సహజీవనం చేసే యోగ్యత ఎలాగూ లేదు. అందుకే నా చివరి కోరికగా మీరు నా ముందు కొచ్చి ప ఫ బ భ మ అనండి. అంటే ఇక ఎప్పుడూ మీ వెంటపడను!" అంటూ అంతిమ అస్త్రాన్ని ప్రయోగించాను.

నా వింత కోర్కెకు ఆశ్చర్య పోయింది. ఇక నుంచి తన వెంటపడే గొడవ వుండదని కాబోలు సరేఅంది. ఆ మాటకు ఆనందంతో క్రిందపడి గిలగిలా కొట్టుకోవాలనిపించింది.

ఆలస్యం ప్రేమామృతం విషం. వెంటనే ఆమె ఎదురుగా నుంచుని నా చూపుని ఆమె పెదవులపై


రచయిత చిరునామా

వర్దినీడి సురేష్‌బాబు

జూనియర్ అసిస్టెంట్
డిగ్రీ కాలేజి
నిరవాసరం - 534 245


7-2-92 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక

# ప ఫ బ భ మ (కథ)

కేంద్రీకరించి గట్టిగా నా చెవులు మూసుకున్నాను.

ప్రత్యూష 'ప ఫ బ భ మ' అని ఒక్కొక్క అక్షరం విడివిడిగా పలికింది. ఆమె అన్న ప్రతి అక్షరానికి నా ముఖంలో మార్పు వెనక అర్థం ప్రత్యూషకు అర్థం అవలేదేమోగాని నా మనసు మాత్రం ఎగిరే పావురమయింది. ఒక్కసారిగా ప్రత్యూషని



ఆఖరిసారిగా నఖశిఖపర్యాంతం చూసి అక్కడ నుంచి మాయమయ్యాను.

అప్పటి నుంచి ఆమె ఆలోచనలన్నీ ఆ అక్షరాలపైనే వుంటాయని నాకు తెలుసు. వాటి వెనకా ఏదో వుందనే క్యూరియాసిటీ నా గురించి ఆలోచించే క్షణాలను ఆమెకు కలుగజేసింది. అదే నాకు ప్లస్ పాయింట్. నేను ఊహించినట్టుగానే తెలుగు లెక్చరర్ దగ్గరకి వెళ్ళి వాటికి వేరే అర్థాలు ఏమైనా వున్నాయా అని తెలుసుకుంది.

గంట క్లాసు తీసుకొనే సరికి ప్రత్యూష మూడు రోజులు కాలేజి మానేసింది.

ఆ మూడు రోజులు నాకు మూడు యుగాలయ్యాయి. ప్రతి రోజు ప్రత్యూషకు కనిపించకుండా జాగ్రత్తపడుతూ ఆమె ప్రతి కదలికను ఓ కంట కనిపెట్టాను. నేను కనిపిస్తానేమో అని వెతకడం ఆమె పనయింది.

ఒక రోజు అర్జెంటు పని మీద వెడుతున్నవాడిలా సైకిల్‌పై ఆమె ప్రక్క నుంచి వెళ్ళిపోయాను.

నిదురలో త్రుళ్ళిపడిన దానిలా "ఏవండ్" అంది.

సైకిల్ సడన్ బ్రేక్‌తో మూడు రౌండ్లు తిరిగి ఆమె ప్రక్క నాగింది.

నేనామెతో పలికించిన అక్షరాలను గూర్చి అవి చదివినపుడు నేను చెవులు మూసుకున్న విధానాన్ని గూర్చి సూటిగా అడిగేసింది.

"ప్రత్యూషగారూ ప్రేమ అనేది ఎలా వుంటుందో, అది అనుభవిస్తే ఎంత మధురంగా వుంటుందో మొన్నటి' వరకు తెలియనివాడిని. మీ రూపంతో ఆ విలువ నాకు తెలిసింది.

''మొన్న మీ ప్రవర్తనతో చివరికి త్యాగమే మిగిలేలా వుందని అనిపించింది. మిమ్ములను పొందలేని జీవితం వ్యర్థం అని తెలుసు. అందుకే కనీసం మీ ముద్దు తాలూకు ముద్ర లైనా దక్కుతాయని ఆ అక్షరాలు పలికించాను. ఇక నా శేషజీవితాన్ని మొన్న మీరిచ్చిన ఆ ఐదు ముద్దులతో గడిపేయాలని నిర్ణయించుకున్నాను'' అంటూ ప్రేమ విలాపాన్ని వొలకబోశాను.

ప్రత్యూష చిరు కోపం ప్రదర్శిస్తూ, "ముద్దా! నేనెప్పుడిచ్చాను" అంటూ కంగారుపడింది. బండి సగం లైనులోకి వచ్చింది. అదే అదనని నాకు తెలుసు. వెంటనే ప్రేమకు క్లైమాక్స్ దృశ్యం చిత్రించాను.

"మొన్న మీ ముందు నుంచుని మీ పెదవులు చూస్తూ చెవులు మూసుకున్నాను. అంటే మీరు మాట్లాడే మాట నాకు వినిపించదు. అపుడు మీరన్న ప ఫ బ భ మ అక్షరాలు పెదవులతో పలికేవి. అవి అన్నప్పుడు శబ్దం వినిపించకుండా మీ రెండు పెదవులు నా ముందు కలుసుకుంటుంటే కొంచెం దూరం నుంచి మీరు నా వైపు విసిరే ముద్దులు కాక ఏమౌతాయి'' అని ప్రత్యూష ముఖంలోకి చూస్తూ అన్నాను.

ఆమె నా వైపు కోపంగా చూసింది. ఇద్దరి మధ్య కొన్ని క్షణాలు చూపుల ఘర్షణ. కోపంగా చూస్తున్న ఆ చూపును భరించలేక ముఖం ప్రక్కకు తిప్పుకుందామనుకునేలోగా ప్రత్యూష ముఖంలో నవ్వు ప్రత్యక్షమయింది. ఆ నవ్వు నాకు ఎక్కడ తగలాలో అక్కడే తగిలింది.

అప్పటి నుండి రెండు హృదయాలను కలిపిన ఐదు అక్షరాలను నాలుగు పెదవులతో రోజూ అనుకుంటూనే వున్నాము. ☆